

నిరుద్యోగులకు అండగా..
● ఉచిత కోచింగ్ ఇస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్
● ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక
● శిక్షణ సమయంలో అలవెన్స్‌లతోపాటు భోజన వసతి
- గణేశ్‌నగర్ (ఆంధ్రజ్యోతి) 6



ఎస్సీ స్టడీ సర్కిల్‌లో తరగతులు వింటున్న అభ్యర్థులు(ఫైల్)

టీబీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు 8

ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్‌లో గందరగోళం

● బరిలో ఉంటుందా...లేదా?
● ఆశావహుల్లోనూ అనుమానం
● మౌనం వీడని అధిష్ఠానం





పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఫిబ్రవరిలో జరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్, బీజేపీ ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పోటాపోటీగా ఓటర్లను నమోదు చేయిస్తూ ముందకు దూసుకుపోతున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లో మాత్రం ఎటువంటి కదలిక కనిపించడం లేదు. ఆ పార్టీ నుంచి టిక్కెట్ ఆశిస్తున్న వారు నిర్వహిస్తున్న ఒకటీ.. అరా.. కార్యక్రమాలు తప్ప ఎటువంటి సందడి లేదు. అసలు ఎన్నికల్లో ఆ పార్టీ తరుపున అభ్యర్థి పోటీలో ఉంటాడా.. లేదా.. అనే విషయంపై స్పష్టత రావడం లేదు. బీఆర్ఎస్‌కు మంచి పట్టున్న ఉత్తర తెలంగాణలో విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికను అధిష్ఠానం పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

7

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

కరీంనగర్‌టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్‌కమిషన్ ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. కలెక్టర్ పమేలా సత్పతి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాల్లో 26,977 మంది అభ్యర్థులు పరీ క్షలు రాయాల్సి ఉండగా మొదటి రోజు 13,273మంది హాజరయ్యారు. రెండో రోజు ఉదయం 12,930 మంది, 12,922 మంది పరీక్షలు రాశారు. జడ్పీ కార్యాలయంలో తెల్లవారు జామున స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరిచిన ప్రశ్న పత్రాలను రూట్ల వారీగా పోలీసు బందోబస్తు మధ్య పరీక్షా కేంద్రా లకు తరలించారు. అదనపు కలెక్టర్ ప్రఫు ల్ దేశాయ్, స్ట్రాంగ్‌రూమ్ ఇన్‌చార్జి పవన్ కుమార్, డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ విజయ్‌కుమార్, ఆర్ఐ సురేశ్ ఆధ్వర్యం లో స్ట్రాంగ్ రూమ్ సీలు తీశారు. కార్యక్ర మంలో రీజినల్ కో ఆర్డినేటర్లు వరలక్ష్మి, సతీష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీ చరణ్ పాల్గొన్నారు.

నేడు డీఈవోపై ఆర్జేడీ విచారణ

కరీంనగర్‌టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావుపై ఉపాధ్యాయ సంఘాలు చేసిన ఫిర్యాదు మేరకు పాఠశాల విద్య వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి మంగళవారం విచా రణ జరుపనున్నారు. విచారణకు హాజరు కావాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సమాచార మిచ్చారు.

జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలి

● కలెక్టర్ పమేలా సత్పతి ● అట్టహాసంగా ప్రారంభమైన సీఎంకప్ పోటీలు



సీఎంకప్ క్రీడల్లో పరుగు పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలను ఆమె ప్రారంభించారు. అంతకుముందు కలెక్టర్ క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో నిర్వహించిన పోటీలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్లు అద్వితీయ ప్రతిభ కనబరిచి చాంపియన్లుగా ఎదిగి జిల్లా పేరును నిలపాలన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే సీఎం కప్ క్రీడలను గ్రామ పంచాయతీ స్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించడం గర్వకారణమన్నారు. కరీంనగర్ డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, జూడో, బేస్‌బాల్, ఆర్చరీలో తొలి రోజు పోటీలు నిర్వహించగా రెండువేల మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారన్నారు. తెలంగాణ ఒలింపిక్ సంఘ సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో క్రీడలకు తలమానికంగా జిల్లా నిలుస్తుందన్నారు. కలెక్టర్ రన్నింగ్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఖో-ఖో క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ యూనిస్‌పాషా, సొల్లు సారయ్య, అంతటి శంకరయ్య పాల్గొన్నారు.

● మొదటి రోజు ఫలితాలు

జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో భాగంగా మొదటి రోజు మహిళలు, పురుషుల విభాగాల్లో ఖో-ఖో, కబడ్డీ, వాలీ బాల్, జూడో, అథ్లెటిక్స్, బేస్ బాల్, ఆర్చరీ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు ముగిసే సమయానికి ఖో-ఖో మహిళల విభాగంలో గంగాధర మండలం ప్రథమ స్థానం, శంకరపట్నం మండలం ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ క్రీడాంశంలో పురుషుల విభాగంలో తిమ్మాపూర్ మండలం ప్రథమస్థానం, గంగాధర మండలం ద్వితీయ స్థానాలను, మహిళల విభాగంలో కొత్తపల్లి మండలం ప్రథమస్థానం, సైదాపూర్ మండలం ద్వితీయ స్థానం సాధించాయి. కబడ్డీలో మహిళల విభాగంలో కరీంనగర్ అర్బన్ మండలం ప్రథమ స్థానం, హుజూరాబాద్ మండలం ద్వితీయ స్థానాలను సాధించాయి. ఖో-ఖో పురుషుల విభాగంలో, కబడ్డీ పురుషుల విభాగంలో సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లను మంగళవారం నిర్వహించే పోటీలతోపాటు నిర్వహించనున్నారు.



ఖో-ఖో ఆడుతున్న క్రీడాకారులు

వాహనదారుల కష్టాలు...

● బారికేడ్లతో కూడళ్ల మూసివేత



కమాన్ వద్ద స్టాపర్లతో మూసి వేసిన రోడ్డు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ముఖ్య కూడళ్లయిన కమాన్, తెలంగాణ చౌక్, పాత లేబర్ అడ్డా కూడళ్లను ట్రాఫిక్ పోలీసులు కొద్ది రోజులు బారికేడ్లతో మూసివేస్తున్నారు. ఆ ప్రాంతాలను వన్‌వేగా మారుస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కమాన్ వద్ద ఇరువైపులా రోడ్లను బారికేడ్లతో మూసివేయడంతో హౌసింగ్ బోర్డు కాలనీ వైపు నుంచి వన్‌టౌన్ వైపు వెళ్లే వాహనదారులు కోతిరాంపూర్ వైపు దాదాపు కిలోమీటరు దూరం వెళ్లి తిరిగి రావాలసి వస్తోంది. పాత లేబర్ అడ్డా వద్ద రోడ్డును బారికేడ్లతో మూసివేయడంతో వాహనదారులు చాలా దూరం వెళ్లి తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ చౌక్ నుంచి సెవెన్‌హిల్స్ వైపు వెళ్లే మార్గంలో కూడా ఒకవైపు దారిని మూసివేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల ఇదే విధంగా బారికేడ్లను అడ్డుగా పెట్టి వన్‌వేలను ఏర్పాటు చేశారు. ఈ వన్‌వేలతో వాహనదారులు చాలా దూరం వెళ్లడంతో పెట్రోల్ నష్టంతోపాటు సమయం వృథా అవుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకే..

ముఖ్య కూడళ్లలో, రహదారులతో సాయంత్రం సమయంతోపాటు పండుగల సమయాల్లో వాహనల రద్దీ అధికంగా ఉండి తరచుగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. దీనిని నివారించేందుకు తాత్కాలికంగా బారికేడ్లను ఏర్పాటు చేసి వన్‌వే చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమాన్ వద్ద రద్దీని తగ్గించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశామని, వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా కోతిరాంపూర్ వైపున, వన్‌టౌన్ వైపున రోడ్డు డివైడర్‌లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశామని సీఐ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అనుమతి రాగానే ఈ రెండు చోట్ల డివైడర్ తొలగించి వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా, ట్రాఫిక్ స్తంభించిపోకుండా చర్యలు తీసుకుంటా మన్నారు. తరచుగా ట్రాఫిక్ స్తంభించడం, ప్రమాదాల నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలకు వాహనదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

కొండెంగ ఫ్లెక్సీలతో కోతులకు చెక్

● ప్రతి ఇంటికి ఫొటోల ఏర్పాటు
● వాసవి కాలనీవాసుల ప్రయోగం



ప్రతి ఇంటి గేట్‌కు వీధిపొడవునా కొండెంగ ఫొ టో ఫ్లెక్సీల ఏర్పాటు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో కోతుల బెడద... అవి చేసే అల్లరి ఇంతా అంతా కాదు... ఒకేసారి గుంపులకు గుంపులుగా ఇళ్లలోకి వెళ్లి చేతికి దొరికిన వస్తువులను తీసుకెళుతున్నాయి. ఎవరైనా వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తే వారిపై దాడి చేస్తున్నాయి. కోతులు కొండెంగలను (కొండముచ్చులు) చూసి భయపడతాయి. నగరంలోని వాసవీనగర్ కాలనీవాసులు ఒక ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. రోజురోజుకు పెరుగుతున్న కోతుల బెడద నుంచి ఉపశ మనం పొందేందుకు ప్రతి ఇంటి గేట్‌కు కోతులు భయపడే విధంగా వివిధ భంగి మలో ఉన్న కొండెంగల ఫొటోలున్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. కాలనీలోని అన్ని ఇళ్లలో ఇలాగే కొండెంగల ఫొటోలు పెట్టుకున్నారు. కోతుల బెడద కొంత తగ్గిందని, గతంలో మాదిరిగా కోతులు ఎక్కువగా రావడం లేదని కాలనీ వాసులు చెబుతున్నారు. కాలనీకి వెళ్లిన వారు ప్రతి ఇంటి ముందు ఏర్పాటు చేసిన కొండెంగ ఫొటో ఫ్లెక్సీలను చూసి ఆశ్చర్యపోతున్నారు. కుక్కలున్నాయి.. జాగ్రత్త అనే బోర్డులు చూశాం కానీ, ఇక్కడ కొండెంగల ఫొటోలు ఏర్పాటు చేయడం ఇక్కడే చూస్తున్నామంటున్నారు.



వాసవీనగర్‌లో ఇంటి గేట్లకు కొండెంగ ఫొటోఫ్లెక్సీ ఏర్పాటు

మెట్ట ప్రాంతంలో వరినాట్లు

● నెలరోజులు ముందుగానే యాసంగి పనులు ప్రారంభించిన రైతులు



సైదాపూర్ మండలం ఆరెపల్లిలో నాటు వేస్తున్న మహిళలు

సైదాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన సైదాపూర్ మండలంలో వరినాట్లు ఊపందుకున్నాయి. మండలంలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో బావులు, బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తారు. గత సంవత్సరం వర్షాలు తక్కువగా కురవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. యాసంగిలో సాగు చేసిన 40శాతం పంట పొలాలు ఎండి పోయాయి. దీంతో రైతులు ఈ సంవత్సరం ముందుగానే యాసంగిలో వరినాట్లు వేస్తున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారం నుంచి సంక్రాంతి వరకు యాసంగి నాట్లు వేసేవారు.

కానీ ఈ సంవత్సరం డిసెం బరు మొదటి వారం నుంచే నాట్లు వేయడం ప్రారంభించారు. దీంతో యాసంగి వరినాట్లు ఊపందుకున్నాయి. మెట్ట ప్రాంతమైన సైదాపూర్ మండలంలో కొన్ని గ్రామాల నుంచి మిడ్ మానేరు కాలువ వెళ్తుంది. గత సంవత్సరం పంటలు ఎండడాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుగానే అప్రమ త్తమయ్యారు. మిడ్ మానేరు కాలువ పూడిక తీత, కాలువలోనే పిచ్చి మొక్కలను తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కాలువ మరమ్మతులకు 15 లక్షలు రూపాయలు విడుదల చేశారు. త్వరలోనే మరమ్మతులు పూర్తి చేసి పంట పొలాలకు నీరందించనున్నారు.

బావులు, బోర్లపైనే ఆధారపడి పంట సాగు చేస్తాం..



ఈ యాసంగిలో ఆరెకరాల వరిపొలం నాటు వేశాను. గత సంవత్సరం డిసెంబరు చివరి వారంలో నాటు వేశాను. దీంతో నీళ్ల లేక కొంత పొలం ఎండిపోయింది. ఈ సంవత్సరం నెల రోజుల ముందుగానే నాటు వేశాను. మా గ్రామం మెట్ట ప్రాంతంలో ఉంటుంది. ఇక్కడి రైతులం బావులు, బోర్లపైనే ఆధారపడి పంట సాగు చేస్తాం. మెట్ట ప్రాంతం కావడంతో తొందరగానే బావుల్లో నీరు అడుగంటి పోతాయి.

- జున్నేని స్వామిరావు, రైతు, అమ్మనగుర్తి

నాలుగున్నర ఎకరాలలో నాటు వేశాను

గత సంవత్సరం జనవరిలో వరి నాటు వేశాం. చాలా వరకు పంట చేతికందే సమయంలో ఎండిపోయింది. ఈ సంవత్సరం ఎండిపోకుండా, పంట కాపాడుకు నేందుకు డిసెంబరు మొదటి వారంలోనే నాలుగున్నర ఎకరాల నాటు వేశాను.

- వెంగల మొండయ్య, రైతు, ఆరెపల్లి

క్రిస్మస్ కార్నివాల్ ప్రారంభం



విద్యార్థినులు తయారు చేసిన క్రిస్మస్ ట్రీలు

కరీంనగర్‌టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం క్రిస్మస్ కార్నివాల్ నిర్వహించారు. జిల్లాలోని కేజీబీవీల్లో ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ విభాగంలో శిక్షణపొందిన విద్యార్థినులు తయారు చేసిన క్రిస్మస్ ట్రీలు, న్యూఇయర్ గ్రీటింగ్ కార్డులు, డెకరేషన్ హౌజ్‌లు, డెకరేషన్ బంతులు, టిష్యూపేపర్లు, శాంత క్లాజ్‌లు, ఉలెన్ బాస్కెట్లు ప్రదర్శనలో ఉం చారు. కార్నివాల్‌ను శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తయారు చేసిన వస్తువులను ఆసక్తిగా పరిశీలించారు. విద్యార్థినుల సృజ నాత్మకతను ప్రశంసించారు. కార్నివాల్‌లో ఉన్న వస్తువులను కొనుగోలు చేశారు. ఐదు కేజీబీవీల విద్యార్థినులకు 1500రూపాయలు ప్రోత్సాహక బహుమతిగా సమగ్ర శిక్షా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ అందించారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేర కు జిల్లాల్లోని అన్ని కేజీబీవీల విద్యార్థినులకు ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇస్తున్నామని, అందులో భాగంగా ఈ కార్నివాల్ ఏర్పాటు చేసినట్లు జెండర్ ఈ క్వాలిటీ కో ఆర్డినేటర్ కృపారాణి తెలిపారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, గంగాధర, చొప్ప దండి, కరీం నగర్, తిమ్మాపూర్, చిగురు మామిడి కేజీబీ వీల విద్యార్థినులు, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు పద్మ, రజిత, కవిత, స్వప్న, షబానా, సమ గ్ర శిక్ష ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీని వాస్, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా..

- ఉచిత కోచింగ్ ఇస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్
- ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక
- శిక్షణ సమయంలో అలవెన్స్‌లతోపాటు భోజన వసతి

గణేశ్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రస్తుత పరిస్థితుల్లో విపరీతమైన పోటీ ఉంది. ఉద్యోగాలు సాధించాలంటే పటిష్టమైన ప్రణాళికతోపాటు అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన ఉండాలి. అవసరమైన స్టడీ మెటీరియల్‌తోపాటు అనుభవజ్ఞుల మార్గదర్శకత్వం ఉంటే ఉద్యోగం సాధించవచ్చు. వీటన్నిటిని సమకూరుస్తోంది ఎస్సీ స్టడీ సర్కిల్. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో వెలువడే పలు నోటిఫికేషన్లకు అనుగుణంగా కోర్సులను రూపొందించి ఈ సంస్థ శిక్షణ ఇస్తోంది. ఒకప్పుడు ఈ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే ప్రైవేట్ సంస్థలు ఢిల్లీ, హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లోనే ఉండేవి. ఫీజు వేలల్లో ఉండడం తోపాటు అక్కడికి వెళ్లి వసతి ఏర్పాట్లు చేసుకొని చదువుకోవడం ఖరీదైన వ్యవహారం. పేద నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో ప్రైవేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వమే స్టడీ సర్కిల్‌లను ఏర్పాటు చేసింది. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2016 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కరీంనగర్‌లో ఏర్పాటైంది. ఇప్పటి వరకు ఈ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది 269 మంది ఉద్యోగాలను సాధించారు.



ఎస్సీ స్టడీ సర్కిల్‌లో క్లాస్ వింటున్న విద్యార్థులు

● అర్హత:

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు డిగ్రీ పాసై కుటుంబ వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయల లోపు ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు అర్హులు. ఇందులో ఎస్సీలకు 75 శాతం, బీసీలకు 15 శాతం, ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్ ఉంటుంది. అభ్యర్థులు tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు శిక్షణను అందిస్తారు.

● వివిధ ప్రభుత్వ శాఖల్లో సాధించిన ఉద్యోగాలు

ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ తీసుకొని ఇప్పటి వరకు 269 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను సాధించారు. బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజర్/క్లర్క్-11, సబ్ ఇన్‌స్పెక్టర్/పోలీస్ కానిస్టేబుల్స్-91, ప్రభుత్వ ఉపాధ్యాయులు/డిగ్రీ, జూనియర్ కాలేజీ లెక్చరర్స్-45, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు-55, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్-6, జూనియర్ అకౌంట్ ఆఫీసర్స్-2, గ్రూప్-4లో-17, క్లర్క్ ఉద్యోగాలు-8, రైల్వే/స్టాఫ్ సెలక్షన్ కమిషన్/ఇతర విభాగాల్లో 34 మంది ఉద్యోగాలు సాధించారు.



ఎస్సీ స్టడీ సర్కిల్‌లో క్లాస్ చెబుతున్న అధ్యాపకుడు

నిపుణులతో బోధన

ఒక బ్యాచ్‌కు గరిష్ఠంగా 100 మందికి ఐదు నెలల వ్యవధిలో ఫౌండేషన్ కోర్సులో భోజన వసతులతో కూడిన శిక్షణ ఇస్తారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, జనరల్ యాప్టిట్యూడ్, ఇంగ్లీష్ తదితర సబ్జెక్టులను నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తారు. వీటితోపాటు రోజువారీ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహిస్తారు. శిక్షణతోపాటు పుస్తకాల కొనుగోలుకు 2,500 రూపాయలతోపాటు వ్యక్తిగత అవసరాల కోసం నెలకు అమ్మాయిలకు 150, అబ్బాయిలకు 100 రూపాయలు చెల్లిస్తారు.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

-బండ శ్రీనివాస్, డైరెక్టర్, ఎస్సీ స్టడీ సర్కిల్



నిరుద్యోగులకు అన్ని పోటీ పరీక్షలపై అవగాహన కలిగిస్తూ ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేస్తున్నాం. వివిధ స్థాయిల్లో ఉన్న ప్రభుత్వ అధికారులను స్టడీ సర్కిల్‌కు ఆహ్వానించి విద్యార్థులకు సూచనలు ఇప్పించి ప్రేరణ కలిగిస్తున్నాం. ఆడియో, వీడియో బోధన పద్ధతుల ద్వారా నిష్ణాతులతో వివిధ అంశాలను వివరిస్తున్నాం. పోటీ పరీక్షలకు సంబంధించి మాదిరి పరీక్షలను నిర్వహించి అభ్యర్థుల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తున్నాం.

కోచింగ్ ఉపయోగపడింది

- కుమారస్వామి, గ్రూప్-4 ఉద్యోగి



నేను గ్రూప్-4 ఉద్యోగం సాధించడానికి స్టడీ సర్కిల్ కోచింగ్ చాలా ఉపయోగపడింది. పట్టణాలకు వెళ్లి డబ్బులు చెల్లించి కోచింగ్ తీసుకునే స్తోమత లేని వారికి స్టడీ సర్కిల్ ఓ వరం. కోచింగ్‌లో ఐదు నెలల సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాన్ని సాధించా. నిష్ణాతులతో కోచింగ్ ఇవ్వడంతో పుస్తకాలు, భోజన వసతి కల్పించారు.

స్టడీ సర్కిల్ ద్వారా కల సాకారమైంది

-తేజస్వి, ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్



ఉద్యోగాన్ని సాధించాలనే నా కల స్టడీ సర్కిల్ ద్వారా సాకారమైంది. నిపుణుల శిక్షణ, మెటీరియల్ ఉద్యోగ సాధనకు ఎంతో ఉపయోగపడింది. బలహీన వర్గాల విద్యార్థులకు ఇది ఒక వరం. స్టడీ సర్కిల్‌లో చేరిన తర్వాత ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్ ప్రిలిమినరీ పరీక్ష పాసయ్యాను. తర్వాత మెయిన్స్, ఇంటర్వ్యూ పూర్తి చేసుకొని స్టడీ సర్కిల్‌లో ఉండగానే బ్యాంక్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించా. స్టడీ సర్కిల్ వాతావరణం నాకెంతో ప్రోత్సాహాన్ని అందించింది.

దుబాయిలో బస్సు ప్రమాదం

దమ్మన్నపేట వాసి మృతి



ఎర్రయ్య (ఫైల్)

మేడిపల్లి, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): దుబాయిలో ఆదివారం రాత్రి జరిగిన బస్సు ప్రమాదంలో జగిత్యాల జిల్లా దమ్మన్నపేట గ్రామానికి చెందిన షేర్ ఎర్రన్న(50) మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన గాజుల గంగరాజంకు గాయాలైనట్లు కుటుంబీకులకు సమాచారం అందింది. వీరు ఇద్దరు పదేళ్ల క్రితం దుబాయిలో ఓ నిర్మాణ కంపనీలో కార్మికులుగా చేరారు. ఏడాదికి ఓసారి స్వగ్రామానికి వస్తూ పోతున్నారు. ఆదివారం వీరికి జీతాలు రావడంతో దర్వీస్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులు దాదాపు 80 మంది వారుంటున్న ప్రాంతంలో డబ్బులను ఇంటికి పంపించే సౌకర్యం లేకపోవడంతో పాటు, నిత్యావసరాల కొనుగోలు కోసం కంపెనీ బస్సులో అందరూ కలిసి అజ్మాన్ అనే ప్రాంతానికి వచ్చి తిరుగు ప్రయాణం అయ్యారు. బస్సు ఘాటు రోడ్డు పైనుంచి లోయలో పడింది. ఈ ప్రమాదంలో ఎర్రన్నకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గంగరాజంకు గాయాలు కావడంతో ఆక్కడే ఆస్పత్రికి తరలించారు.

భూ తగాదాలతో ఘర్షణ

● ఒకరికి గాయాలు

ధర్మారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) కొంత కాలంగా ఓ కుటుంబంలో ఉన్న భూముల గొడవ చివరకు అన్నదమ్ముల మధ్య ఘర్షణకు దారి తీసింది. మండలంలోని రామయ్యపల్లి గ్రామానికి చెందిన మార్క శంకరయ్య, మార్క లింగయ్య అన్నదమ్ముల మధ్య కొంత కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. వారి తండ్రి మార్క మల్లయ్య పేరు మీద ఉన్న ఇల్లుకు సంబంధించి స్థలాన్ని అన్న శంకరయ్యకు తెలియకుండా తమ్ముడు లింగయ్య తన బిడ్డ పేరు మీద రిజిష్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంలో అన్నదమ్ముల ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉండగా సోమవారం పొలం వద్ద గట్ల విషయంలో లింగయ్యకు శంకరయ్య కుమారుడికి గొడవ జరిగి శంకరయ్య కుమారుడిపై లింగయ్య చేయిచేసుకున్నాడు. గొడవ అనంతరం శంకరయ్య కొడుకు ఇంటికి వచ్చి తండ్రికి చెప్పగా, కోపోద్రేకుడైన శంకరయ్య అతని కుమారుడితో కలిసి లింగయ్యపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో లింగయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. కాగా తన తండ్రిని చంపాలనే ఉద్దేశంతోనే ఇద్దరు కలిసి కట్టెలతో కొట్టి తీవ్రంగా గాయపరచారని లింగయ్య కుమారుడు మార్క అజయ్ ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎండీ సాబీర్ తెలిపారు.

18న వర్గీకరణపై బహిరంగ విచారణ

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఈ నెల 18 బుధవారం రోజున ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బహిరంగ విచారణ ఉంటుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. షెడ్యూల్డు కులాల ప్రతినిధుల నుంచి ఉపకులాల వర్గీకరణ అంశంపై కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ జస్టిస్ డా.శమీం అక్తర్ వినతులు స్వీకరిస్తారని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ప్రతినిధులు గమనించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరెపల్లికి చెందిన కోనేరు రవి(22) అనే యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. రవి చొప్పదండిలో వెల్డింగ్ పనిచేస్తూ ప్రతి రోజు ఆరెపల్లి నుంచి ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి బైక్‌పై వస్తుంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం చొప్పదండి నుంచి ఆరెపల్లికి వస్తుండగా నగునూర్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. స్థానికుల సహాయంతో రవిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఇటుకబట్టీ కార్మికుడి అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ వద్ద ఇటుకబట్టీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన భగవాన్ జన్‌కర్(40) సోమవారం ఉదయం వైన్‌షాపు వెనుక వైపు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం వరకు ఇటుక బట్టీ వద్దనే ఉండి ఆ తరువాత ఇంటికి వెళ్లిన భగవాన్ జన్‌కర్ సోమవారం ఉదయం వైన్‌షాపు వద్దకు వెళ్లాడు. అక్కడ జన్‌కర్ మృతిచెంది ఉండడాన్ని మద్యం షాపులో పనిచేసే వారు గుర్తించి మృతుడి సోదరుడికి సమాచారం అందించారు. మృతుడి ముక్కు, ముఖంపై గాయాలున్నాయని పోలీసులు పేర్కొన్నారు. భగవాన్ జన్‌కర్ భార్య పిల్లలు ఒడిశాలోనే ఉంటుండగా అతను ఒక్కడే ముగ్దుంపూర్‌లో నివాసం ఉంటూ ఇటుకబట్టీలో పనిచేస్తున్నాడు. మృతుడి సోదరుడు దురుబల్ జన్‌కర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్య మృతి కేసులో భర్తకు 10 ఏళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భార్య మృతికి కారణమైన గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన భర్త కదారి రాజశేఖర్ (35)కు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గంభీరావుపేటకు చెదిన రాజశేఖర్ తన భార్య భాగ్యను అనుమానంతో డిసెంబరు 2, 2020న కొట్టాడు. ఆ దెబ్బలకు తాళలేక భాగ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటనపై అప్పటి ఎల్లారెడ్డిపేట సీఐ బన్సీలాల్ కేసు నమోదు చేసి రాజశేఖర్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. శిక్షపడడంలో కృషి చేసిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, అప్పటి సీఐ బన్సీలాల్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్‌ను ఎస్పీ అభినందించారు.

ఇద్దరు యువకుల ఆత్మహత్య



దుర్గాప్రసాద్(ఫైల్)

జూలపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన ఆసంపెల్లి దుర్గాప్రసాద్(19) అనే విద్యార్థి తన ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసంపెల్లి పోచయ్య-విజయ దంపతుల మొదటి కుమారుడైన దుర్గప్రసాద్ కరీంనగర్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో చీరెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థి మృతిపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్య సమస్యతో..

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన కర్రు సతీష్(38) అనే యువకుడు ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌లోని లిక్కర్ గోదాంలో పనిచేస్తున్న సతీష్, మూడు నెలల క్రితం ఉద్యోగం మానేసి పెద్దంపేటలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసైన సతీష్ కాలేయం దెబ్బతిని తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. సతీష్ తీరుతో మనస్తాపానికి గురై భార్య పుట్టింటికి వెళ్లింది. అనారోగ్య సమస్యలతో మానసికంగా కుంగిపోయాడు. ఆదివారం సాయంత్రం హైద్రాబాద్‌కు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ అరెస్టు

గంభీరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట వైన్స్ కేసులో అంతర్రాష్ట్ర దొంగను స్థానిక పోలీస్‌లు అరెస్టు చేశారు. రెండు నెలల కిందట లింగన్నపేట శివారులోని రేణుక వైన్స్‌లో దొంగలు పడి రూ.10 వేల నగదు, ఫుల్ బాటిళ్లు ఎత్తుకెళ్లారు. ఈ కేసులో ఏ1 నర్సింలును అక్టోబరు 10న రిమాండ్‌కు తరలించారు. ఏ2 బీరప్ప హరీష్ అనే దొంగను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సొంత గ్రామంలో ఆదరణ కరువు

పిచ్చి మొక్కల మధ్య సినారె విగ్రహం



హన్మాజీపేటలో సినారె విగ్రహం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

వేములవాడ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, సాహితీవేత్త సింగిరెడ్డి నారాయణరెడ్డి విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. సినారె స్వస్థలం హన్మాజీపేటలో ఏర్పాటు చేసిన విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగినా పట్టించుకోవడం లేదు. విగ్రహం వద్దకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మొక్కల తొలగింపుపై ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

స్కూటీ దగ్ధం



దగ్ధమైన స్కూటీ

వీణవంక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ బస్టాండ్ వద్ద సోమవారం స్కూటీ దగ్ధమైంది. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఆకతాయిలు ఎవరైనా చేశారా అనేది తెలియాల్సి ఉంది. వాహనం ఎవరిది అనే వివరాలు కూడా తెలియాల్సి ఉంది పంచాయతీ కార్యదర్శి కొండ అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అక్రమంగా బియ్యం తరలింపు

● లారీని పట్టుకున్న గ్రామస్థులు

ఓదెల, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఒక రైస్ మిల్ నుంచి సుద్దాలలో గల స్టేజ్ వన్ సివిల్ సప్లై కార్పొరేషన్ గోదాంకు వెళ్లాల్సిన బియ్యం లారీని దారి మళ్లించడంతో అనుమానంతో నాంసానిపల్లి గ్రామస్థులు పట్టుకుని అధికారులకు సమాచారం అందించారు. సోమవారం రాత్రి లారీ నంబర్ ఏపీ 29 టీఏ 4420 గల దానిలో 290 క్వింటాళ్ల బియ్యం లోడ్‌తో సుద్దాలలో గల పౌరసరఫరాల సంస్థ స్టేజి వన్ గోదాంనకు బియ్యాన్ని తరలించారు. ఆ బియ్యం స్టేజి-2 ద్వారా రేషన్ షాపులకు సరఫరా కావాల్సి ఉంది. అయితే ఈ బియ్యం లోడుతో ఉన్న లారీ సుద్దాలకు వెళ్లకుండా ఓదెల మండలం నాంసానిపల్లి మీదుగా ఆ మండలంలో గల ఓ రైస్ మిల్లుకు వెళుతున్నట్లు సమాచారం అందింది.



పట్టుబడిన బియ్యం లారీ

బియ్యం లారీ నాంసానిపల్లి మీదుగా వెళ్తుండడాన్ని గమనించిన హరిపురం, ఓదెలకు చెందిన ఇద్దరు యువకులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే అనుమానంతో లారీని నిలిపివేసి స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సమాచారం ఇవ్వడంతో వారు తమ బృందంతో అక్కడికి చేరుకుని లారీలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. అలాగే లారీ డ్రైవర్ వద్ద ఉన్న వేబిల్లును కూడా పరిశీలించారు. లారీలో ఉన్న బియ్యం శాంపిల్స్ తీసి ఆ లారీని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ లారీ మండలంలోని ఓదెల, కొమిర శివారులోని ఒక రైస్ మిల్లుకు తరులుతున్నట్లు సమాచారం. సదరు మిల్లు యజమాని ఆ బియ్యాన్ని సీఎంఆర్ కింద పెట్టేందుకే అక్కడికి ఆ బియ్యంను తరలిస్తున్నట్లు సమాచారం. లారీలో ఉన్న బియ్యం శాంపిల్స్ సేకరించి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గొర్రెల మృత్యువాత

మల్లాపూర్, డిసెంబరు, 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన కొత్తముక్కెర రాజన్నకు చెందిన గొర్రెలు సోమవారం అనుమానాస్పదంగా మృత్యువాత పడ్డాయి. రోజు మాదిరిగానే రాజన్న తన గొర్రెల మందను మేపేందుకు సోమవారం గ్రామ శివారులోని రైస్ మిల్లు ప్రాంతానికి తీసుకెళ్లాడు. సమీపంలో మేతమేసిన గొర్రెలలో11 మృత్యువాత పడగా మరో 25 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. వెంటనే గమనించిన రాజన్న అపస్మారక స్థితికి గురైన వాటికి వైద్యం చేయించాడు. మృత్యువాత పడ్డ గొర్రెలను పోస్టుమార్టం కోసం పశువైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం చేస్తేగాని గొర్రెల మృతికి గల కారణాలు తెలుస్తాయని వైద్యులు తెలిపారు. గొర్రెలు మృతి చెందడంతో రెండు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని రాజన్న ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



గొర్రెలను ఢీకొట్టి దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

గొర్రెలను ఢీకొట్టి ద్విచక్రవాహనం దగ్ధం

వెల్గటూర్ : మండలంలోని స్తంభంపల్లి స్టేజి సమీపంలో గొర్ల మంద పైకి ద్విచక్ర వాహనం దూసుకెళ్లిన సంఘటనలో ఐదు గొర్రెలు మృతి చెందగా ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంనూర్‌కు చెందిన ఐతె రాము రాయపట్నం వైపు నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో రోడ్డుపై వెళ్తున్న గొర్ల మందను అతి వేగంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఆరు గొర్రెలు మృతి చెందాయి. ద్విచక్రవాహనం అతి వేగంగా రోడ్డుపై పడడంతో మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది. వాహనదారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఏసీబీకి చిక్కిన అటవీశాఖాధికారి

● రూ. 4,500 లంచం తీసుకుంటుండగా పట్టివేత

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో సోమవారం ఏసీబీ అధికారుల వలలో అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి అఫీసొద్దీన్ చిక్కాడు. మామిడి రైతు నుంచి రూ.4,500 లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన పల్లాపు నరేష్‌కు కథలాపూర్ మండలం ఇప్పపల్లి గ్రామంలో మామిడి చెట్లు ఉన్నాయి. వారం రోజుల క్రితం 4 మామిడి చెట్లను నరికి వాటిని తరలించేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా నరేష్ అటవీ శాఖాధికారి అఫీసొద్దీన్‌ను సంప్రదించగా రూ. 10 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు చేసేది లేక రూ.5 వేలు ఇచ్చి రవాణాకు అనుమతి తీసుకున్నాడు. మళ్లీ రెండోసారి కొన్ని చెట్లను నరికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని సోమవారం సదరు అధికారిని కలువగా మళ్లీ రూ.4500 డిమాండ్ చేయడంతో బాధితుడు ఇస్తానని ఒప్పుకున్నాడు. అనంతరం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు చేయడంతో ఏసీబీ అధికారుల సూచన మేరకు సోమవారం సాయంత్రం అఫీసొద్దీన్ అద్దె ఇంటి వద్ద బాధితుడు 4,500 లంచం ఇస్తుండగా అక్కడే ఉన్న అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడ్డ అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి

24 గంటల్లో చోరీ కేసు ఛేదించిన పోలీసులు

గంభీరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) దొంగతనం కేసును 24 గంటల్లో గంభీరావుపేట పోలీసులు ఛేదించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన చిందం బీరయ్య నాలుగు రోజుల క్రిందట తన కూతురు వద్దకు వెళ్లి 15న తిరిగి వచ్చే క్రమంలో మాచారెడ్డి వద్ద దిగాడు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన దుండుగుల సాయిలు అనే వ్యక్తి బీరయ్య వద్దకు వచ్చి తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని, అడవిలో పెరిగే మోతుకు ఊడుగు చెట్ల వేర్లు కావాలని నమ్మించారు. వేరే వాళ్ల చేతితో వేర్లు తెంపితేనే పనిచేస్తుందని నమ్మబలికి సమీప పెద్దమ్మ ఆడవిలోకి బీరయ్యను తీసుకెళ్లాడు. పెద్దమ్మ అడవిలో ఉన్న మోతుకు, ఊడుగు చెట్ల వద్దకు వెళ్లాక వేర్లు తెచ్చేటప్పుడు ఒంటిపై ఎలాంటి బంగారు. వెండి వస్తువులు ఉండరాదని బీరయ్యకు చెందిన బంగారం చెవిపోగులు, వెండి కడియాలను బలవంతంగా తీసేయించాడు. బీరయ్య చెట్ల వేర్లను తీస్తుండగా, బీరయ్యకు చెందిన బంగారు చెవి పోగులు, వెండి కడియాలను సాయిలు ఎత్తుకుని పారి పోయాడు. సంఘటనపై పోలీసులకు బాధితుడు బీరయ్య పిర్యాదు చేయడంతో చాక చక్యంగా గాలింపు చర్యలను చేపట్టి 24 గంటల వ్యవదిలో సాయిలును పట్టుకుని చెవి పోగులు, కడియాలు రికవరి చేశారు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది సహకారంతో నేరస్తుడైన సాయిలు 24 గంటల్లో పట్టుకోడవంతో ఉన్నతాధికారులు అబినందించారు.



పోలీసులు రికవరీ చేసిన బంగారం చెవి పోగులు, వెండి కడియాలు

వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం పేరిట మహిళల నుంచి నగదు వసూలు చేసిన ధరావత్ రాజేష్‌నాయక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు సోమవారం తెలిపారు. పీఎంఈజీ (ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం) పథకంలో భాగంగా స్థానిక సదానంద థియేటర్ బిల్డింగ్‌ను రాజేష్ నాయక్ అద్దెకు తీసుకున్నాడు. అన్నపూర్ణ ఫుడ్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎంఈజీ సభ్యత్వం పేరిట మహిళల వద్ద రూ. 2,600 నుంచి 5,200 వరకు వసూలు చేసినట్టు సీఐ తెలిపారు. ఐడీ కార్డు, ట్రైనింగ్ ఫీజు, యూనిఫాం పేరిట వసూలు చేసినట్టు తెలిపారు. హనమాన్ నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేష్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 16: జాతీయస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ యోగాసన పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. కోయంబత్తూర్‌లో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి యోగాసన పోటీలకు కరీంనగర్ జిల్లా దేవంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు తిట్ల హర్షిత్ బాలాజీ, పురాణం దీపక్, జుట్టు అశ్విత్ ఎంపికయ్యారు. వీరితో పాటు జిల్లాకు చెందిన వి.రామకృష్ణ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా, అనిల్ కుమార్ రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్, మేనేజర్లను జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్‌వి జనార్దన్ రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి అభినందించారు.

మానకొండూర్ పాఠశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

మానకొండూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కే. సత్యనారాయణరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో కొనసాగుతున్న పదవతరగతి స్టడీ అవర్స్‌ను పరిశీలించి పూర్తి అయిన సిలబస్ పై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తరగతుల గురించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. మధుసూదనాచారి, ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

యూట్యూబ్... నటనపై కాస్తో కూస్తో ఆసక్తి ఉన్న వారికి ఇదొక మంచి వేదిక. లక్షల్లో పెట్టుబడులు పెట్టి తీసే చిత్రాలకన్నా చిన్న పాటి పెట్టుబడితో మారుమూల గ్రామాల్లో ఎంతో మంది షార్ట్ ఫిలిమ్స్ తీస్తూ పేరు తెచ్చుకుంటున్నారు. అంతే కాకుండా ఆర్థికంగా స్థిరపడుతున్నారు. మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన మిల్కూరి అంజయ్య ఉరఫ్ అంజిమామ కూడా తన నటనతో ఎంతో మందిని మెప్పించి అతి తక్కువ సమయంలోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. మొదట గ్రామంలో చిన్న చిన్న షోలలో నటించే అంజి ఇటీవల నవంబర్‌లో సొంతంగా చానల్ ప్రారంభించాడు. తాను తీస్తున్న షోలను అందులోనే అప్‌లోడ్ చేస్తున్నాడు. కేవలం రెండు నెలల్లోనే తన చానల్‌కు 50వేల మంది సబ్‌స్క్రైబర్స్ అయ్యారు.



45 రోజులు.. 50 వేల సబ్‌స్క్రయిబర్స్

- యూట్యూబ్, సినిమాల్లో రాణిస్తున్న అంజిమామ
- 700లకు పైగా వీడియోలు..
- నటనా ఆసక్తి గల యువతకు ప్రోత్సాహం

మల్యాల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 45 రోజులు..50 వేల మంది సబ్‌స్క్రైబర్స్. ఇదీ అంజిమామ చానల్‌కు ఉన్న ప్రత్యేకత. యూట్యూబ్ చానల్ ప్రారంభించిన చాలా రోజులకు సబ్‌స్క్రైబర్స్ సంఖ్య పెరుగుతుంది. కానీ అంజిమామ తాను ఎంచుకునే కథలతో అభిమానులను ఆకట్టుకుని అతి తక్కువ సమయంలోనే సబ్‌స్క్రైబర్స్ సంఖ్యను పెంచుకున్నాడు. 'అంజి మామ' తన చానల్‌ను 2024 నవంబరు నెల మొదట్లో ప్రారంభించాడు. పది వీడియోలు చేయగా తొమ్మిందిటిని అప్‌లోడ్ చేశా డు. చానల్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 55,129మంది సబ్‌స్క్రైబర్స్ అయ్యారు. అంజి మామ వీడియోలకు 3.6మిలియన్లు వీక్ష ణలు వచ్చాయి. అయిదుగురు సభ్యులు గల బృందంతో చిత్రీకరిస్తున్న అంజిమామ చానల్‌లో అప్‌లోడ్ చేసిన వాటిలో 'అంజిమామ కారు, టూర్'కు 6లక్షల వీక్షణలు, 'కుండ చికెన్'కు 5లక్షలు, 'అంజిమామ అద్దె టూర్'కు 5.5లక్షలు, 'అంకాపూర్ చికెన్'కు 3లక్షల వీక్షణలు వచ్చాయి. అన్నింటిలోనూ అంజి ఉపయోగించే ఊత పదం 'అల్లుళ్లు, కోడళ్లు, ఎం జాయ్ చేయాలిరా' అనే దాంతో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అంజి ఎక్కడ కనిపించినా అభిమానులు చుట్టుముడుతూ అభిమానాన్ని చాటుకుంటున్నారు.



చిత్రీకరణలో అంజిమామ బృందం

● మై-విలేజ్ షోలతో అంజి మామగా గుర్తింపు..

అంజి మామ యూట్యూబ్, సినిమాల్లో సహజనటనతో అందరినీ ఆకట్టుకుంటూ మన్ననలు పొందుతున్నాడు. మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన మిల్కూరి అంజయ్య తన బంధువులు గంగవ్వ, మిత్రులు, పలువురు యువకులతో కలిసి మై-విలేజిషోలో అనేక వీడియోలతో యూట్యూబర్‌గా ఆకట్టుకున్నాడు. అంజయ్య కాస్తా అంజిగా గుర్తింపు పొందాడు. వినోదం, గ్రామీణ జీవనం, కుల వృత్తులు, లైఫ్‌స్టైల్, దొంగ పోలీస్, కుటుంబనేపథ్యం లాంటి దాదాపు వివిధ రకాలకు సంబంధించి 700లకు పైగా వీడియోలతో యూట్యూబ్‌లో మంచి గుర్తింపు పొందాడు. స్థానికంగా గల ఆసక్తికర అంశాలు, విజ్ఞానం, రైతులు, కార్మికులు, అవేర్‌నెస్, లోకల్ స్క్రిప్ట్ లాంటి అనేక వీడియోలు ఏదైనా వీక్షకులను అలరించే విధంగా తీర్చిదిద్దుతూ అంజిమామ బ్రాండ్‌గా వెలుగొందుతున్నాడు. ఇటీవలే అంజిమామ తానే సొంతంగా 'అంజిమామ చానల్' ఏర్పాటు చేశాడు. షార్ట్ ఫిలిమ్స్ చేస్తూ తన చానల్‌లోనే ఆ వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నాడు.

● గ్రామంలో చిన్న షోలలో నటిస్తూ..

13ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం ఇరాక్ వెళ్లి వచ్చిన అంజి గ్రామంలో కొందరు చేస్తున్న షోలలో చిన్నపాటి నటన చేస్తూ అందులోనే ఇమిడిపోయాడు. ఆ షోలలో మంచి పేరు రావడంతో యూ ట్యూబ్‌లో నటించడం కొనసాగించాడు. తోటి మిత్రులతో నటించిన పాత్రలకు గుర్తింపు రావడంతో పాటు చానల్‌కు వేలల్లో సబ్‌స్క్రైబర్స్ అయ్యారు. ఆ ప్రోత్సాహంతో అంజిమామగా పేరు తెచ్చుకుని రాణిస్తున్నాడు.

● సినిమాల్లోనూ రాణింపు

అంజిమామ యూట్యూబర్‌గానే కాకుండా సినిమాలు, ఇతర అనేక ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటూ రాణిస్తున్నాడు. నెట్‌ఫ్లిక్స్ వెబ్‌సిరీస్‌లో రాములా, ఇంటింటి రామాయణం, మేం ఫేమస్, చరత-కామాక్షి, కేబుల్‌రెడ్డి, సోపతులు తదితర చిన్న సినిమాల్లో నటించాడు. అంజి తాను గుర్తింపు పొందడమే కాకుండా నటనపై ఆసక్తి గల యువత, చిన్నారులను ప్రోత్సహిస్తూ తన వీడియోలలో అవకాశం కల్పిస్తున్నాడు.

వైభవంగా గుంటి పెరమాండ్ల రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులోని గుంటి పెరమాండ్ల (కట్ట కింది తీర్థం) రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకుడు చింత సునీల్ ఆధ్వర్యంలో వేద పండితులు పనీంద్ర, అరుణ్ మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌రావు, కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, పెరుమాండ్ల సత్యనారాయణ, ఉరుమడ్ల శ్రీనివాస్, బన్న రాజేష్, ఎర్ర శంకర్, జాగిలం చిన్న భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపిస్తోంది. వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కోడె మొక్కు చెల్లింపునకు సుమారుగా మూడు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. మల్లికా ర్జునస్వామికి ఎంతో విశిష్టమైన షష్టిమాసం సందర్భంగా భక్తులు ముందుగా రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆల యంలో ధనుర్మాసం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యుడు ధనుర్మాసంలోకి సోమవారం ప్రవేశించడంతో ఉదయం స్వామివారితో పాటు రామచంద్రస్వామి, నారాయణమూర్తి స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పాలబోగ నైవేద్యాన్ని సమర్పించినట్లు ఆలయ అర్చకులు, ఆలయ సూపరిం టెండెంట్ తిరుపతిరావు వెల్లడించారు.



రాజన్న ఆలయం వద్ద భక్తులు



ధర్మపురిలో దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురిలో ఆలయంలో..

ధర్మపురి: ధనుర్మాసోత్సవాలు ధర్మపురి క్షేత్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజున లక్ష్మీ నరసింహస్వామి, అను బంధ ఆలయాల్లో ఆలయ వేదపండితులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆల య సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెం ట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్ భక్తులు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబర్ 2024లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ సోమవారం విడుదల చేశారు. ఈ ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

● మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో గ్రామాల్లోని అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుంటే ఈ నెల 27న అమరవీరుల స్తూపం వద్ద మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ తెలిపారు. సోమవారం సిరిసిల్ల పట్టణ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో జేఏసీ కమిటీ జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్యతో కలసి మాట్లాడారు. మాజీ సర్పంచుల అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్‌రావు, పల్ల రాజేశ్వర్‌రెడ్డి, కోవ లక్ష్మి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి ప్రస్తావించడంపై కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క నుంచి స్పష్టమైన హామీ రాకపోవడాన్ని వ్యతిరేకించారు. రూ.691 కోట్ల మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లింపులపై స్పష్టమైన ప్రకటన చేయకుండా దాటవేసే ధోరణిని అవలంబించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ జిల్లా నాయకులు చాకలి రమేష్, గున్నాల లక్ష్మణ్, సిరికొండ శ్రీనివాస్, అరె మహేందర్, చిట్నేని శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు 'గుడ్డు' భారం

● పెరిగిన ధరలతో నష్టం ● బిల్లులు రాక కార్మికుల అవస్థలు

కథలాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం పెట్టే నిర్వాహకులకు కోడిగుడ్డు భారంగా మారింది. ప్రభుత్వం నిర్వాహకులకు గుడ్డుకు కేవలం రూ. 5లు ఇస్తుండగా బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం రూ. 7 ధర పలుకుతోంది. ఈ క్రమంలో వంట చేసే కార్మికులకు నష్టం ఎక్కువగా ఉంటోంది. దీంతో నిర్వాహకులు భోజనంలో కోడిగుడ్డు పెట్టడానికి వెనకంజ వేస్తున్నారు.



వంటచేస్తున్న నిర్వాహకులు

● వారానికి మూడు సార్లు...

మండలంలో 30 మండల పరిషత్ పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత, 10 జిల్లా పరిషత్, కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్‌లో సుమారు 4 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం వారంలో మూడు సార్లు కోడిగుడ్డు ఇవ్వాలనే నిబంధన విధించింది. నిర్వాహకులు అప్పులు చేసి ఉడకబెట్టిన కోడిగుడ్లను విద్యార్థులకు అందించాల్సిన దుస్థితి నెలకొంది. అసలే గత మూడు నెలలుగా బిల్లులు ప్రభుత్వం నుంచి రాక నిర్వాహకులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ఇచ్చే ధర కంటే బహిరంగ మార్కెట్‌లో రు.2లు అధికంగా ఉండడంతో వచ్చే కమీషన్ కూడా పొందలేని పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. వంట గదుల్లేక కొందరు ఆరుబయటే వంటలు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న చోట నిర్వాహకులకు లాభం రాకపోగా నష్టాలతో కాలం గడుపుతున్నారు. 5 తరగతుల లోపు ఒక్కో విద్యార్థికి రు. 6లు, 9వ తరగతి స్థాయిలో రు. 9లు, పదవ తరగతి విద్యార్థులకు రు. 10ల చొప్పున కమీషన్ చెల్లిస్తున్నారు.

ప్రభుత్వమే కోడిగుడ్డు సరఫరా చేయాలి

- చెన్నవేని దశరథం, సీఐటీయు జిల్లా నాయకులు



కోడిగుడ్డు ధరలు బహిరంగ మార్కెట్‌లో కొండెక్కడంతో నిర్వాహకులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. అందువల్ల ప్రభుత్వమే పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా చేయాలి. ప్రభుత్వం పాఠశాలల్లో వెట్టిచాకిరి చేయిస్తోంది. హెల్పర్లకు రు 3 వేలు ఇస్తామని చెప్పి అందులో వెయ్యి రూపాయలు ఇవ్వడమే లేదు. నెలల తరబడి వేతనాలు, బిల్లులు చెల్లించపోవడం దారుణం.

రోజురోజుకూ పెరుగుతున్న అప్పులు

- భారత, నిర్వాహకురాలు ఊట్‌పల్లి



అసలే చాలీచాలని కమీషన్‌తో పొగ మధ్య వంటలు చేస్తూ విద్యార్థులకు భోజనం పెడుతున్నా ప్రభుత్వాలు కనికరించడం లేదు. ఏళ్ళ తరబడి వివిధ రకాల నిరసనలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వంటకు అవసరమ్యే సరుకులు అప్పులు చేసి కిరాణాల్లో తెస్తున్నాం. మరో పక్క కోడిగుడ్డు ధరలు పెరగడంతో నష్టాలకు గురై అప్పుల్లో కూరుకు పోతున్నాం. రెగ్యులర్ చేసి న్యాయం చేయాలి.

- బరిలోఉంటుందా.. లేదా?
- ఆశావహుల్లోనూ అనుమానం
- మౌనం వీడని అధిష్ఠానం



ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్‌లో గందరగోళం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఉత్తర తెలంగాణ అంటే బీఆర్ఎస్ పార్టీకి ఊపిరై నిలిచిన ప్రాంతం. మలిదశ తెలంగాణ ఉద్యమకాలంలో తన పార్టీ ఎమ్మెల్యేలను, ఎంపీలను రాజీనామాలు చేయించి వచ్చిన ఉప ఎన్నికలను ఉద్యమంలో అస్త్రాలుగా మలుచుకున్న బీఆర్ఎస్ ఆ తర్వాత కూడా ఏ ఎన్నికలు వచ్చినా తనదే పైచేయి అన్నట్లుగా వ్యవహరించేది. ఏడాదిగా అధికారానికి దూరమైనందుకో, మరెందుకో గాని తనకు పెట్టని కోటగా ఉంటూ వస్తున్న కరీం నగర్, మెదక్, నిజామబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో జరు గుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ఏమాత్రం పట్టించు కోన్నట్లు ఉంటున్నది. కాంగ్రెస్, బీజేపీ ఓటర్ల నమోదు విష యంలో, ప్రచారం విషయంలో మూడు నెలలుగా నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నాయి. బీఆర్ఎస్‌లో ఎటువంటి కదలిక లేదు.

● ఎవరికి వారుగా ఆశావహుల ప్రచారం

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ఐఎంఏ నాయకుడు డాక్టర్ బీఎన్ రావు మాత్రమే తమంత తాముగా కొంత మేరకు ఓటర్ల నమోదును చేపట్టి నియోజకవర్గ పరిధిలో తమ ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగానే మొదట ప్రచారం చేసుకున్న ట్రస్మా నాయకుడు యాదగిరి శేఖర్‌రావు పార్టీ ఎటూ తేల్చని వైఖరిని చూసి ఇండిపెండెంట్‌గా రంగంలో ఉంటానని ప్రకటించారు. రవీందర్‌సింగ్, బీఎన్ రావు మాత్రం అభ్యర్థులుగా పార్టీ గుర్తించినా, లేకున్నా పోటీలో ఉండాలని నిర్ణయించుకుని ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అభ్యర్థిని రంగంలో దింపుతుందా, లేదా అన్న విషయంలో వారికి కూడా స్పష్టత లేదని ప్రచారం జరుగుతున్నది. పార్టీ అగ్రనేతలైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత పట్టభద్రుల నియోజకవర్గంలోనే ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నా ఎమ్మెల్సీ ఎన్నికలను పట్టించుకోవడం లేదు. ఈ నియోజవర్గం నుంచి బీఆర్ఎస్ మూడుసార్లు తన అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించుకున్నది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన జీవన్‌రెడ్డి గెలుపొందారు. ఆయన పదవీకాలం మార్చి నెలాఖరుతో ముగియనుండగా ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఓటర్ల నమోదు చేపట్టి ముసాయిదా జాబితాను సిద్ధం చేసింది. రెండో విడత ఓటర్ల నమోదుకు ఇచ్చిన గడువు కూడా ఈ నెల 9తో ముగిసింది. ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా నిర్వహిం చాయి. ప్రధానంగా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న అభ్య ర్థులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నమోదు కార్యక్రమాన్ని చేపట్టి మూడు లక్షల పైచిలుకు మం దిని ఓటర్లుగా చేర్పించారు.

● నియోజకవర్గంలో బలాబలాలు

నియోజకవర్గ పరిధిలో 42 అసెంబ్లీ, ఆరు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. నాలుగు పార్లమెంట్ స్థానాల్లో, ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్నోంది. 15 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులున్నారు. వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వీరితో కలుపుకొని కాంగ్రెస్‌కు 22 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఇద్దరు ఎంపీలుఆ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. 13 మంది ఎమ్మెల్యేలు, అందులో పార్టీ అగ్రనేతలు కూడా ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నా బీఆర్ఎస్ మాత్రం ఇక్కడ అభ్యర్థిని పోటీకి నిలుపుతుందా లేదా అన్నదానిపై స్పష్టత రావడ లేదు.

● నామమాత్రంగా కార్యక్రమాలు

కాంగ్రెస్, బీజేపీ నువ్వానేనా అన్నట్లు పోటీపడుతూ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే బీఆర్ఎస్ మొక్కుబడిగా కొన్ని నిరసన కార్యక్రమాలకు పరిమితమయిందని కార్యకర్తలే అసం తృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కీలక నేతలందరూ ఈ ప్రాంతంలోనే ఉన్నా పార్టీని చురుకుగా ఉంచడంలో ఎవరూ బాధ్యత వహించడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమానికి, ఆ తర్వాత ఏర్పడిన ప్రభుత్వానికి వెన్నంటి ఉంటూ వచ్చిన ఉత్తర తెలంగాణలో పూర్వ వైభవం సాధించాలంటే ప్రస్తుతం అనుసరిస్తున్న వైఖరితో సాధ్యం కాదని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయి. ఉద్యమకాలంనాటి చైతన్యంతో పార్టీని ముందుకు నడిపే నాయకత్వం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. తొలి నుంచి తమకు అండగా ఉంటున్న జిల్లాల్లో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పార్టీ మళ్లీ ఉత్తేజితం అవుతుందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పాలనను ప్రజాపాలన విజయోత్సవాల పేరిట కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకువెళుతోంది. ఆ పార్టీ వైఫల్యాలను ఎండగట్టేందుకు నాయకత్వం ఆశించినరీతిలో ప్రయత్నం చేయడం లేదని పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయవర్గాలు మాత్రం ఈ విషయంలో పలు ఊహాగానాలు చేస్తున్నాయి. పరిస్థితులు అనుకూలించి విజయం సాధిస్తే పరవాలేదు కానీ, ఓడిపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో దాని ప్రభావం ఉంటుందని బీఆర్ఎస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతో నువ్వానేనా అన్నట్లు పోటీపడి విజయం సాధించే పరిస్థితులు ఉన్నాయా, లేవా అనే విషయంలో బీఆర్ఎస్ నాయకత్వం ఒక నిర్ణయానికి రాలేకపోతోందని తెలిసింది. అందుకే అభ్యర్థిని నిలిపే విషయాన్ని ప్రకటించకుండా ఆచీతూచి వ్యవహరిస్తున్నదని రాజకీయవర్గాలు అంటున్నాయి. ఈ విషయంలో బీఆర్ఎస్ ఏం నిర్ణయం తీసుకోబోతుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

టీబీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు

హుజూరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. సోమవారం హుజూరాబాద్ పరిధిలోని బోర్నపల్లిలో వంద రోజుల టీబీ నిశ్చయ్ శిబిర్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల పాటు ఎడతెరిపి లేకుండా దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధి ఎక్కువగా పోషకాహార లోపం ఉన్న వారికి వస్తుందని, దీనిని అశ్రద్ధ చేయవద్దన్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే భయపడాల్సిన అవసరం లేదని, ఉచితంగా ప్రభుత్వం మందులు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో చెల్పూర్ వైద్యాధికారి డాక్టర్ మధు, డాక్టర్ కీర్తన, సీహెచ్‌వో శ్యామ్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, విజేందర్‌రెడ్డి, టీబీ వ్యాధి సిబ్బంది కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భక్తిశ్రద్ధలతో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



ప్రవచనం చేస్తున్న గోపాలకృష్ణమాచార్యులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పవిత్ర ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు గృహాలను, ఆలయాలను మామిడి తోరణాలు, పూలతో సుందరంగా అలంకరించారు. ప్రథమ పాశురాన్ని చదివారు. ఇళ్లలో, ఆలయాల్లో మూల, ఉత్సవ మూర్తులకు, బేరాలకు అభిషేక, అర్చనలు నిర్వహించారు. పొంగలిని నైవేద్యంగా సమర్పించారు. శ్రీవైష్ణవ సాంప్రదాయపరుల గృహాలు, ఆలయాలు పాశుర అనుసంధానాలు, ప్రవచనాలు, సేవాకాలాలతో మార్మోగాయి. మార్కెట్ రోడ్, విద్యానగర్, మంకమ్మతోట, కట్టరాంపూర్, జ్యోతినగర్ వేంకటేశ్వర దేవాలయాలు, బొమ్మకల్ రోడ్ యజ్ఞవరాహక్షేత్రం, చైతన్యపురి మహాశక్తి ఆలయం, వావిలాలపల్లి, సప్తగిరి కాలనీ, గాంధీరోడ్ రామాలయాలు, విష్ణు సంబంధిత ఆలయాలు భక్తుల దర్శనాలతో సందడిగా మారాయి. స్త్రీలు గోదాదేవి వ్రతాన్ని (శ్రీవ్రతాన్ని) ప్రారంభించారు. యజ్ఞవరాహ క్షేత్రంలో ప్రముఖ ఉభయ వేదాంత పండితుడు సాతులూరి గోపాల కృష్ణమాచార్యస్వామి ఉదయం శ్రీవచన భూషణం, సాయంత్రం తిరుప్పావై ప్రవచనం చేశారు. ఆయా ఆలయాల్లో నిర్వాహకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను నెరవేర్చని సీఎం'

సుభాష్‌నగర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తెలంగాణ గ్యాడ్యుయేట్స్ ఫోర్స్ అధినేత డాక్టర్ బండారి రాజ్‌కుమార్ విమర్శించారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్‌రెడ్డి పాలనలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 15వేల ఉద్యోగాలు కాకుండా కాంగ్రెస్ హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రశ్నిస్తే నిరుద్యోగులు, ప్రజలను అరెస్టులు చేసి హక్కులను అణచి వేస్తున్నారని ఆరోపించారు. గ్రూపు-2 పరీక్షకు కేవలం 46శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారన్నారు. ఇన్నాళ్లు కాంగ్రెస్‌ను భుజాలపై మోసిన వారు ఎందుకు మూగబోయారని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాల కోసం నిరాహార దీక్షకైనా సిద్ధమని ఆయన ప్రకటించారు.

ఉచిత వైద్యశిబిరం

భగత్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని బావుపేటలో అపోలో రీచ్ ఆసుపత్రి, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం దస్మేశ్ ఫిల్లింగ్ స్టేషన్‌లో నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి ఉచిత మధుమేహం, రక్తపోటు, డాక్టర్ కన్సల్టేషన్, డైటీషియన్ సేవలు, ఫిజియోథెరపి సేవలు అందించారు. ఈ శిబిరంలో అపోలో రీచ్ ఆసుపత్రి కరీంనగర్ పరిపాలనాధికారి డాక్టర్ నాగ సతీష్‌కుమార్, మార్కెటిగ్ సీనియర్ మేనేజర్ సదానందం, హసన్ అలీ, సుధాకర్, హరీష్, నర్సింగ్ సిబ్బంది, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కరీంనగర్ ఎస్‌ఓ శరణ్‌జిత్, హమీద్, అంకుర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంకు సన్మానం

భగత్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజును టీఎంయూ నాయకులు సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో టీఎంయూ జిల్లా అధ్యక్షుడు కె.శంకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎంపిరెడ్డి, నాయకులు మనోహర్, రవీందర్, ఎవిఆర్‌రెడ్డి, ఎంఆర్‌రెడ్డి, గోలి ప్రవీణ్, శ్రీకాంత్, ఈఆర్‌రెడ్డి, అహ్మద్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్చరీలో ఆర్టీసీ ఉద్యోగి ప్రతిభ

భగత్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చీఫ్ మినిస్టర్ కప్ ఆర్చరీ విభాగంలో ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపులో పనిచేస్తున్న కూన కిషన్ మొదటి స్థానంలో నిలిచారు. కాంపౌండ్ విభాగంలో 50మీటర్ల దూరంలో మొదటి స్థానం సాధించారు. మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి కాంపౌండ్ ఆర్చరీ విభాగంలో ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన కూన కిషన్‌ను ఆర్టీసీ అధికారులు, సిబ్బంది అభినందించారు.

'ధర్నాను విజయవంతం చేయాలి'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈనెల 18న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని టీవీజేఏసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వుట్ల ప్రభుదాస్, క్రిష్టిపాటి రఘునాథరెడ్డిలు ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ ఆర్టిజన్ కార్మికులందరు వేలాదిగా తరలిరావాలని ఈసందర్భంగా వారు పిలుపునిచ్చారు.

పాఠశాలల తనిఖీ

కరీంనగర్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం ఫకీర్‌పేట, బహదూర్‌ఖాన్‌పేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఎంఈవో రవీందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫకీర్‌పేటలో 4వ తరగతి విద్యార్థులకు తెలుగు భాషాపై పలు ప్రశ్నలు అడిగారు. బహదూర్‌ఖాన్‌పేట పాఠశాలలో నిర్వహించిన తెలుగు పరీక్షలో పలువురు విద్యార్థులు మంచి మార్కులను సాధించడంపై సంతృప్తి చెందారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయరాణి, కొండారెడ్డిలను అభినందించారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

కరీంనగర్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం జూబ్లీనగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేయడం నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర ప్రక్రియను ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జలజరాణి, ఉపాధ్యాయులు మమత, చంద్ర మౌళి, అంజనేయులు, ఆసిఫ్ అలీ, రాములు, ఉదయ బాను, విమల, గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

నేడు సంగీత విభావరి

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 16: గాన గంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతి మహోత్సవం సందర్భంగా శారదా సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు కళాభారతిలో సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు విద్యాలయ నిర్వాహకురాలు బొజ్జ రేవతి, గాయకుడు కాసు మహేందర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా శాస్త్రీయ, లలిత, జానపద, సినీ నేపథ్య గాయకుడు చంద్రతేజ హాజరౌతున్నారని పేర్కొన్నారు. గాయకులు, సంగీత, సాహిత్యాభిమానులు, నగరవాసులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం స్కేలు ఇచ్చి సమ్మె విరమింపచేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కోహెడ చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెతో విద్యారంగ పనులు కుంటుపడుతున్నాయని ఆయన ఆరోపించారు. సోమవారం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయనతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పోలు సత్యనారాయణ, ఎస్‌జీటీయూ స్టేట్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎస్ మధుసూదన్‌రావు, తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ళుగా చాలీచాలని వేతనాలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు.

పాఠశాలల కార్యకలాపాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్ళి విద్యాశాఖకు వారధిగా డీఈవో, ఎంఆర్‌సీ కార్యాలయాల్లో, పాఠశాలల కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలు రాసి మెరిట్ సంపాదించి ఒప్పంద ఉద్యోగులకుగా నియామకం పొందారని గుర్తు చేశారు. అదే మెరిట్ ప్రాతిపదికన వీరికి మినిమం స్కేలు ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగుల సౌకర్యాలను కల్పించాలన్నారు.

● రూ.5వేల ఆర్థిక సహాయం

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు ఎమ్మెల్సీ అభ్యర్థి పోలు సత్యనారాయణ రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళ వారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సీతారాంపూర్, బ్యాంక్ కాలనీ, జగిత్యాల్ రోడ్, బాలాజీ నగర్, సూర్యనగర్, ఆర్టీసీ కాలనీ, సీతారాంపూర్,గౌడ్స్ కాలనీ, ద్వారకానగర్, హనుమాన్ నగర్, రేకుర్తి చౌరస్తా ప్రాంతం, మెహర్‌నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈసందర్భంగా ఆయన కోరారు.

రేపటి నుంచి మంచినీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 17 నుంచి 23వ వరకు మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఫిల్టర్ బెడ్ వద్ద ఉన్న 36 ఎంఎల్‌డీ ఫిల్టరేషన్ ప్లాంట్‌లో మిషన్ భగీరథ అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నందున నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

'బీసీలకు క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలి'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు క్రిమిలేయర్ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయాలని బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. బీసీ కుల గణన చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, దానికి సహరించిన బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా ముఖ్య సలహాదారు సుధాకర్‌గౌడ్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి పూదరి రాజుగౌడ్, జిల్లా కార్యదర్శి మధుసూదన్, భీహరి శ్రీనివాస్, ఎన్ రమేశ్ పాల్గొన్నారు.

వెలిచాల జగపతిరావుపై గ్రూపు-2లో ప్రశ్నలు

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, మలిదశ తెలంగాణ ఉద్యమ నేత వెలిచాల జగపతిరావు పేరుపై టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూపు-2 పరీక్షల్లో రెండు ప్రశ్నలు వచ్చాయి. నాల్గవ పేపర్‌లో 52వ ప్రశ్నగా 'ఎవరి ఆధ్వర్యంలో తెలంగాణ శాసన సభ్యుల ఫోరం ఏర్పడింది' ప్రశ్న అడిగారు. అలాగే 55వ ప్రశ్నగా 'వెలిచాల జగపతిరావుకు సంబంధించి కింది వాఖ్యలను పరిగణించండి' అనే ప్రశ్నను ఇచ్చారు.

'కాంగ్రెస్ హయాంలోనే సామాన్యులకు న్యాయం'



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు ప్యాట రమేశ్

సుభాష్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలోనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి ప్యాట రమేశ్ అన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోలు, గ్యాస్‌పై ఉన్న సబ్సిడీని ఎత్తివేసి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. బీజేపీ వల్ల సామాన్యులకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలోనే హైదరాబాద్‌కు ఐటీ రంగాన్ని తీసువచ్చామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని కిందిస్థాయికి తీసుకెళ్లారని విమర్శించారు. ఉద్యోగాలు కల్పించలేదని, రైతులకు గిట్టుబాటు ధరను కల్పించలేదన్నారు. కుల వృత్తుల వారిని ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరం చేశారని ఆరోపించారు. గొర్లు కాచేవారు, కుమ్మరులు, గౌడులు వారి పని చేసుకోవాలన్నట్లుగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు.

క్యాలెండర్ విడుదల

కరీంనగర్ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 2025 సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు బల్మూరి కరుణాకర్‌రావు, ఉపాధ్యక్షులు పురుమల్ల శ్రీనివాస్, కార్యదర్శి కోల అన్నారెడ్డి, సహ కార్యదరిశ కొండ గంగాధర్, కరినగర్ విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్‌రావు, ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

'చదరంగంతో ఆలోచనా శక్తి పెంపు'



చదరంగ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఆలోచనా శక్తి పెంపొందుతుందని ఒరియంట్ సిమెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్ శ్రీనిధిరాజ్, డాక్టర్ నార్ల మహేందర్, డాక్టర్ జక్కని తిరుపతిలు అన్నారు. జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ర్యాంకింగ్ చదరంగ పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వంద మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ చదరంగ క్రీడాకారులకు ర్యాంకింగ్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చదరంగంతో ఎత్తుకు పైఎత్తు వేసే ఆలోచనాశక్తి పెంపొందుతుందన్నారు. విద్యార్థులు చదరంగంపై దృష్టి సారించాలన్నారు.

ప్రపంచ చదరంగ చాంపియన్ గుకేష్ క్రీడాస్ఫూర్తితో జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాసర గ్రూపు యాజమాన్యం నాగసముద్రం పురుషోత్తం, శశి, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, ఎ ధీరజ్ గౌరినాయుడు, జిల్లా డెమోక్రటిక్ చెస్ సంయుక్త కార్యదర్శి కంకటి సృజన్‌కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, ఆర్బిటర్లు నితిన్, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి



తిరుపతి యాదవ్

చిగురుమామిడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన రాధారపు తిరుపతియాదవ్ 2006 నుంచి 2020 మార్చి వరకు ఉపాధి హామీ పథకలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించాడు. గత ప్రభుత్వం 20220 నుంచి 2022 వరకు ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించింది. అనంతరం విధుల్లోకి తీసుకున్నది. అధికారులు తిరుపతిని విధుల్లోకి తీసుకోలేదు. తనను విధుల్లోకి తీసుకోవాలని రెండేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. మంత్రి పొన్నం ప్రభాకర్ సిఫారసు చేసినా పట్టించుకోవడం లేదు. తిరుపతి పేద కుటుంబానికి చెందిన వ్యక్తి. ఇద్దరు కూతుళ్ళ, కుమారుడు, భార్య ఉన్నారు. గ్రామంలో ఉన్న చిన్నపాటి ఇళ్లు కూలిపోయింది. అధికారులు తనకు న్యాయం చేయాలని తిరుపతి కోరుతున్నాడు. ఈ విషయంపై ఎంపీడీవో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.


కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది : తిరుపతియాదవ్

నన్ను ఉద్యోగం నుంచి తొలగించడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నాను. కూలి పని చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. మంత్రి సిఫారసు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. విధుల్లోకి తీసుకుని నన్ను ఆదుకోండి.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తిమ్మాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని సీనియర్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ కె.వెంకటేష్ సూచించారు. సోమవారం మండలంలోని రామకృష్ణకాలనీలో గల మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(బాలుర)లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశంలో ఉన్న చట్టాలు, పాటించాల్సిన విధి విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సివిల్ చట్టాలు, క్రిమినల్ చట్టాలు, సైబర్ నేరాలు, ఫోక్సోచట్టం, మోటార్ వాహనాల చట్టం, సోషల్ మీడియా వేదికగా జరిగే నేరాలపై జడ్జి వెంకటేష్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మహేష్, ప్రిన్సిపాల్ పింగిలి వెంకటరమణ పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

వీణవంక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పాఠశాలలో ట్రినిటీ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ మీట్ ముగిసింది. ఈ స్పోర్ట్స్ మీట్‌కు చల్లూరు, భూపాలపల్లి, ఇల్లందకుంట మండలాలలోని విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ జాన్‌థామస్ బహుమతు లను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధరలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

● ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వినతి

గంగాధర, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి వినతిపత్రం అందించినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల విరామ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి డిగ్రీ కళాశాల ఏర్పాటుపై వివరించినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గంగాధర మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేలా చూడాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి స్పందించినట్లు తెలిపారు. సీఎంకు చొప్పదండి నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. తాను గెలుపొందిన తరువాత నియోజకవర్గంలో విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎంను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

చొప్పదండి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని విద్యారంగాన్ని కొనసాగిస్తే జీవితంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు సింహాచలం హరి కృష్ణ అన్నారు. చొప్పదండిలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకులంలో నిర్వహించిన విద్యార్థుల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి వారు విద్యలో రాణించడం వల్లే వారికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, పద్మజ, దీప్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం

చొప్పదండి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి నుంచి రామడుగు మండలం మోతె బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం చొప్పదండిలో నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచనల మేరకు సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి కోటి 20 లక్షల రూపాయలను మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజాన పురం చందు, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, నాయకులు పెరుమాండ్ల గంగయ్యగౌడ్, ముద్దం తిరుపతిగౌడ్, గుర్రం రమేష్‌గౌడ్, కడారి శంకర్, మునిగాల చందు, వొల్లాల కృష్ణహరి, తోడేటి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో నియోజకవర్గ అభివృద్ధి శూన్యం : రసమయి

మానకొండూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది గడిచినా హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గ అభివృద్ధికి తయారు చేసిన రూ.360 కోట్ల ప్రగతి నివేదిక కాగితాలకే పరిమితం అయిందన్నారు. గత ప్రభుత్వం మానకొండూర్‌కు 50 పడకల ఆసుపత్రి మంజూరు చేయిస్తే ఇప్పటి వరకు నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. ఊటూర్ ఇసుక క్వారీ నుంచి నడుస్తున్న లారీలను కాంగ్రెస్ నాయకులు రెండు రోజులు అడ్డుకొని మూడో రోజు కొనసాగించడంలో అంతర్యమేమిటో వారే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.72 కోట్లతో గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు తారు రోడ్డు మంజూరు అయితే ఆ పని ఎందుకు చేయడం లేదన్నారు. నియోజకవర్గంలో 50 శాతం రుణమాఫీ కాలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, మాజీ జడ్పీటీసీలు తాల్లపల్లి శేఖర్‌గౌడ్, సిద్దం వేణు, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలకిషన్, జీవీఆర్

రైతుల సంక్షేమమే ప్రాథమిక సహకార సంఘం లక్ష్యం

వీణవంక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ప్రాథమిక సహకార సంఘం లక్ష్యమని వీణవంక ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ మావూరపు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘ ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం ద్వారా రైతులకు, పాడి పరిశ్రమ కోసం ఇస్తున్నట్లు తెలిపారు. కోర్కల్ గ్రామంలో 30 గుంటల భూమి కొనుగోలు చేశామని, వరిధాన్యం నిల్వల కోసం గోడౌన్‌లను సైతం నిర్మించినట్లు తెలిపారు. రుణమాఫీ కొంత మందికి మాత్రమే జరిగిందని రైతులు ప్రశ్నించారు. డైరెక్టర్లు కామిడి కావ్య శ్రీనివాస్‌రెడ్డి, కట్కూరి మధుసూదన్‌రెడ్డి, ముదిగంటి శ్యామ్‌సుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల్, మాడుగురి సమ్మిరెడ్డి, గుటం సమ్మిరెడ్డి ఉన్నారు.

ఉద్యోగాలు సాధించిన ఇద్దరికి సన్మానం

చొప్పదండి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన ఇద్దరికి గ్రామస్థులు సన్మానం చేశారు. ఎయిర్‌ఫోర్స్ ఎంపికైన రామడుగు సిద్ధార్థకు, సీఐఎస్ఎఫ్‌కు ఎంపికైన సంధ్యకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బత్తుల లక్ష్మీనారాయణ, విలా సాగరం అంజయ్య, రామడుగు ప్రశాంత్, కోలపురి కార్తీక్, కర్ర కాంతం, గద్ద తిరుమల్, రామడుగు ప్రవీణ్, చంద్రశేఖర్, మణిచందర్, పాలమాకుల రాము, వెంకటేష్, కోట గణేశ్, అమనుగంటి శంకరయ్య, చిర్ర మల్లేశం పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో ఘనంగా పడిపూజ

రామడుగు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప స్వాములు పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు ఆధ్వర్యంలో సేవా సమితి ఏర్పాటు చేసి అయ్యప్ప గుడి నిర్మాణానికి పూనుకున్నారు. గుడి నిర్మాణంలో భాగంగా స్వచ్ఛంద సేవా కార్యకర్త తోట కృష్ణ కవిత దంపతులు రూ. 50 వేల విరాళం ప్రకటించారు.

ఆలయానికి విరాళం అందజేత

హుజూరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం అయ్యప్పస్వామి దేవాలయంలో స్వాములకు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక-శ్రీనివాస్ సోమవారం రూ.50వేలు విరాళంగా అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక-శ్రీనివాస్ అత్తమామ గందె సాంబయ్య-వీరలక్ష్మి జ్ఞాపకార్థం అయ్యప్పస్వాములకు చెక్కును అందజేసినట్లు తెలిపారు.

మత్స్య పరిశ్రమ సదస్సుకు వీణవంక వాసి

వీణవంక, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) మత్స్య పరిశ్రమ అభివృద్ధిపై న్యూఢిల్లీలో జరిగిన సదస్సుకు వీణవంక మండల మత్స్యకార్మికుల సంఘం అధ్యక్షుడు వెలివేణి సదయ్య హాజరయ్యారు. ఈ సమావేశంలో మత్స్య కార్మికుల సంఘం రాష్ట్ర చైర్మన్ పులబోయిన భీమయ్య నాగయ్య, వెంకటేష్ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గంగాధర, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కురిక్యాలకు చెందిన మాజీ ఎంపీటీసీ అలువోజి నందయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దామోదర్, నాయకులు మహిపాల్‌రావు, అంజనేయులు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇల్లందకుంట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీఎంటీఏ సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు.

మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీఎంటీఏ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధర్నాకు అనుమతి ఇవ్వాలి

శంకరపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరి ష్కారం కోసం మంగళవారం ధర్నా చౌక్ ఇందిరా పార్క్‌లో జరిగే దర్నాలో పాల్గొనేం దుకు అనుమతి ఇవ్వాలని మండల పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీవో కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యకమంలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.